క్లుప్తంగా

నాడు-నేడు పనుల్లో పురోగతి చూపాలి



సి.బెళగల్‌లో మాట్లాడుతున్న అధికారులు

సి.బెళగల్: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న రెండవ విడత మనబడి నాడు - నేడు పనులలో పురోగతి ఉండాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. ఆయన సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు జ్యోతి, ఆదాంబాషా, ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలని, ఆలస్యం చేసే వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

అదునులోనే విత్తనాలు నాటాలి



అనుగొండలో రైతులకు కొర్ర విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: వర్షాలు తగినంతగా కురిసి భూములు పదునెక్కిన తర్వాతనే పంటలను సాగు చేయాలని ఏఓ రవిప్రకాష్ రైతులకు సూచించారు. సోమవారం అనుగొండ, ఎర్రదొడ్డి, ముడుమలగుర్తి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఏఓ రవిప్రకాష్ సందర్శించి రైతులతో సమావేశమయ్యారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులంతా పంటలు సాగు చేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకోవాలన్నారు. విత్తనాలు, మందులు, ఎరువులను వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోను విత్తుకోరాదన్నారు. అనంతరం ఏఓ రవిప్రకాష్ ఆయా గ్రామాల రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన కొర్ర విత్తనాల ప్యాకెట్లను అందజేశారు. ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ అడ్మిషన్లకు పరీక్ష

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ పాఠశాలలో 7 నుంచి 9వ తరగతి ప్రవేశం కొరకు విద్యార్థులకు సోమవారం రాత పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ దిల్షాద్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను దరఖాస్తు చేసుకున్న విద్యార్థులతో రాత పరీక్షను నిర్వహించగా 25 మంది హాజరైనట్లు తెలిపారు. ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు ఆయా తరగతుల్లో ప్రవేశం కల్పిస్తామని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన శ్రీనివాసులు

ఓర్వకల్లు: కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. పూడిచెర్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు మోటార్ సైకిల్‌పై కర్నూలు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో నారాయణ బాలికల జూనియర్ కళాశాల వద్ద ముందుగా వెళుతున్న వాహనాన్ని అతిగమించే క్రమంలో డివైడర్‌కు ఢీకొట్టాడు. ప్రమాదంలో అతని ఎడమ కాలు విరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని స్థానికుల సహాయంతో హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్యాబోధన

గూడూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటల ద్వారా చిన్నారులకు విద్య నేర్పడమే 'జన భాగీదారి' కార్యక్రమం ఉద్దేశమని ఐసీడీఎస్ గూడూరు సెక్టార్ సూపర్‌వైజర్ కే.సుజాత అన్నారు. సోమవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో 'జన భాగీదారి' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి పిల్లలను పాఠశాలకు పంపని తల్లిదండ్రులను గుర్తించి వారికి అవగాహన కల్పించారు. అనంతరం కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణపై బాలింతలు, గర్భిణులకు వివరించారు. పిల్లల్లో ఎదుగుదల లోపం గుర్తించడం, సరైన పౌష్టికాహారం తీసుకోవడంపై సూచనలు చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడిగరేవులలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొంటారని, గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరిగి ప్రజా సమస్యలతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకుంటారన్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

- పేదల పాలిట రక్ష 'ఫ్యామిలీ డాక్టర్'
- ప్రతి రోజూ ఓ గ్రామంలో వైద్య శిబిరం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య సిబ్బంది సేవలు
- దీర్ఘకాలిక రోగాలతో మంచానికి పరిమితమైన వారికి మెరుగైన వైద్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



చిందుకూరు గ్రామంలో మంచానికే పరితమైన వ్యక్తికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా అమలుచేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ పథకం పేద, మధ్య తరగతి ప్రజల పాలిట వరంగా మారింది. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం ప్రధానం అని గుర్తించి, ఆ మేరకు నాడు-నేడు పథకం ద్వారా ఆయా రంగాలను బలోపేతం చేసింది. వైద్య రంగం విషయానికొస్తే ప్రజల చెంతకే వైద్య సేవలను తీసుకెళ్లింది. దానిలో భాగంగా గత ఏడాది అక్టోబర్ 22 నుంచి ట్రయల్ రన్ చేపట్టిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పథకాన్ని గత నెల 6 నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఈ పథకంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఏరోగమొచ్చినా పట్టణాలకే పరుగులు

గతంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏ చిన్న రోగమొచ్చినా, ఏ పెద్ద జబ్బు చేసిన ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నంద్యాల, కర్నూలు పట్టణాలకు పరుగు పెట్టేవారు. దీర్ఘకాలిక రోగులు, ఆరోగ్య శ్రీలో శస్త్ర చికిత్సలు చేయించుకునేవారు. గర్భిణులు, బాలింతలు కూడా పరీక్షల నిమిత్తం పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. పేద ప్రజలు వైద్యం చేయించుకోలేక, మందులు కొనలేక ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా వైద్యులను, సిబ్బందిని గ్రామాలకు పంపించి వైద్య పరీక్షలు చేయిస్తోంది. అవసరమైన మందులను ఉచితంగా ఇస్తుంది. మండలానికి ఒక 104 వైద్య సేవల వాహనం ఉండగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్-ఫ్యామిలీ ఫిజీషియన్ పథకంతో మరో వాహనాన్ని ప్రభుత్వం సమకూర్చింది. ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించింది. ప్రతి సచివాలయ పరిధిలో నెలకు రెండుసార్లు ఒక్కొక్క గ్రామానికి వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆయా గ్రామాలలోని సచివాలయంలో ఓపీ నిర్వహిస్తారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తారు. ముఖ్యంగా 104లో ఈసీజీ, గర్భిణులకు హార్ట్ రేట్ మానిటర్, హెబీవీ వంటి టెస్టులు 14 రకాల టెస్టులు, 90 రకాల మందులు ఇస్తున్నారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు సేవలు



ప్రభుత్వ లక్ష్యం మేరకు గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో సిబ్బందితో వెళ్లి ఓపీ నిర్వహిస్తున్నాం. వివిధ పరీక్షలతో పాటు రోగులకు అన్ని రకాల వైద్య సేవలందిస్తున్నాం. పేషెంట్లకు అవసరమైన మందులు అందజేస్తున్నాం. ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– డాక్టర్ మొల్లా జబీన్, వైద్యాధికారిణి, గడివేముల పీహెచ్‌సీ

పేదవారిని ఆదుకోవడం సంతోషంగా ఉంది



ఫ్యామిలీ ఫిజీషియన్ పథకంతో పేదవారిని ఆదుకోవడం సంతోషంగా ఉంది. గతంలో పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి మందులు తెచ్చుకునేదాన్ని. ప్రస్తుతం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామంలోనే మందులు ఉచితంగా ఇస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగనన్న వచ్చాక మాలాంటి వారికి మేలు చేస్తున్నారు. మాకు ఖర్చులు ఇబ్బందులు తప్పాయి. మాలాంటి పేదవాళ్లకు జగనన్న అండగా ఉన్నారు.

– పెద్ద వెంకటరంగడు, గడివేముల

ప్రభుత్వ మేలు మరువలేను



గతంలో ఏ చిన్న వ్యాధికి గురైనా నంద్యాల, కర్నూలు వంటి దూర ప్రాంతాల్లో ఆస్పత్రులకు ఎన్నో వ్యయ ప్రయాసలతో వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం సీఎం జగన్ ప్రభుత్వం పుణ్యమా అని ఆ బాధ లేకుండా వైద్యులతో సహా సిబ్బంది మా ఇంటి దగ్గరకే వచ్చి వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులిస్తున్నారు. గ్రామంలోని ఇంటి వద్దకే డాక్టర్లు రావడం ఎంతో మంచిది.

– చిన్నహుసేని, తిరుపాడు

'సుంకేసుల'లో 1.068 టీఎంసీల నీటి నిల్వ

గూడూరు: సుంకేసుల డ్యాంలో సోమవారం 1.068 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కర్నూలు నగరవాసుల నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

1 నుంచి 'జగనన్న సురక్ష'

కర్నూలు (న్యూటౌన్): జూలై 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు కర్నూలు మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూలు ఎంపీడీఓ కేఏ అజాంఖాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు ఎంపీడీఓ ఒక బృందంగా, కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్.శివరాముడు మరో బృందంగా ఏర్పడి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. గ్రామాల్లో అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈఓఆర్డీ ఖాలీక్, పంచాయతీ కార్యదర్శులు తారకేశ్వరి, రంగడు, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చనుగొండ్లలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ పేర్కొన్నారు. ఆయన సోమవారం చనుగొండ్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి పైపులైన్, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. త్వరలోనే ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలకు పరిష్కారం చూపుతానని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మేనిఫెస్టోలో పేర్కొన్న 98 శాతానికిపైగా హామీలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చిందని వివరించారు. గతం టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలకు ఒక్కొక్క పథకానికి లంచాలు ఇస్తేనే మంజూరయ్యే పరిస్థితి ఉండేదన్నారు. గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.2.16 లక్షల కోట్ల సొమ్మును ప్రజలకు అందించినట్లు వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో పనులు చేస్తున్నట్లు చెప్పారు. జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలను పేదలకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మండల కో ఆప్షన్ సభ్యుడు దౌల, నాయకులు మహేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, ఎంపీడీఓ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ లబ్ధి



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో గడప గడపకు సంక్షేమ లబ్ధి చేకూరిందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన సోమవారం కొంగనపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, పింఛన్లు రావడంలేదని చెప్పగా అర్హులై ఉండి పథకాలు అందని వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాలను ఈ కార్యక్రమం ద్వారా మంజూరు చేస్తారని వివరించారు. గ్రామంలోని బీసీ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు కోరగా త్వరలోనే నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులలాకు, మతాలకు, పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశామన్నారు. గత టీడీపీ పాలనలో పథకాలు రావాలంటే జన్మభూమి కమిటీ సిఫారసుతో పాటు నాయకుల అండదండలు ఉండాల్సి వచ్చేదన్నారు. గత టీడీపీ పాలనకు ఈ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆదరించాలని కోరారు. ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, సర్పంచ్ సువర్ణమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కల్లా వెంకట రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రమణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సత్యంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తిమ్మన్న, నాగయ్య, గుండన్న, వరప్రసాద్ రెడ్డి, కేశాలు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



కోడుమూరులో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు



మాట్లాడుతున్న డాక్టర్ శంకర శర్మ

కోడుమూరు రూరల్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోడుమూరు సీఐ శ్రీధర్ సూచించారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సీఐ శ్రీధర్, సెబ్ సీఐ శ్యాంప్రసాద్, ఎస్ఐలు శ్రీనివాసులు, సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కొత్తబస్టాండ్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల, పోలీసు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సెట్కూరు సీఈఓ(మండల ప్రత్యేక అధికారి) పి.వి.రమణ, డాక్టర్ శంకర శర్మ సూచించారు. సోమవారం చిన్నటేకూరు సమీపంలోని బృందావన్ ఇంజనీరింగ్ కళాశాలలో యువజన సర్వీసుల శాఖ–సెట్కూరు ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, మహిళలు, బాలికల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, దిశా మొబైల్ యాప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీఈఓ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అలవాటై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. డాక్టర్ శంకర శర్మ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కళాశాల డైరెక్టర్ శివ ప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందం, అధ్యాపకులు, సెట్కూర్ మేనేజర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సి.బెళగల్ ఎస్ఐ పీరయ్య సూచించారు. సోమవారం స్థానిక మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ, మత్తు పదార్థాలు నియంత్రించేందుకు పోలీసులకు సహకరించాలని, 14500 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

స్పందన సమస్యలకు పరిష్కారం



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బాధితులు

ఓర్వకల్లు: స్పందనలో ప్రజలు అర్జీల రూపంలో సమర్పించిన సమస్యలకు పరిష్కారం చూపుతామని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, వినతులను స్వీకరించారు. ఆర్‌ఓఆర్ రికార్డులలో నమోదు చేసిన తప్పులను సవరించాలని కాల్వ, లొద్దిపల్లె, హుసేనాపురం, కొంతలపాడు, కొమరోలు, పూడిచెర్ల, బ్రాహ్మణపల్లె, నన్నూరు గ్రామాలకు చెందిన బన్నూరు మద్దిలేటి, అంజనమ్మ, బంగి శ్యామల, వెంకటరాముడు, నాయకంటి మాదమ్మ, బండారి సుంకులమ్మ, అగుటు నారాయణ వినతి పత్రం అందజేశారు. అలాగే పేదల ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూమికి ఇంత వరకు పరిహారం చెల్లించలేదని, తమకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని బ్రాహ్మణపల్లెకు చెందిన నాగలక్ష్మి వినతి పత్రం సమర్పించారు. అర్జీలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని తహసీల్దార్ హామీఇచ్చారు.

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం

సి.బెళగల్: ప్రజలు అర్జీల రూపంలో ఇచ్చిన సమస్యలను మండల, గ్రామస్థాయి అధికారులు వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణి ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, మండల అధికారులతో కలిసి స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పోలకల్ గ్రామానికి చెందిన రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు గ్రావెల్‌తో రోడ్డును ఏర్పాటు చేయాలని, బురాన్‌దొడ్డి వాసులు ఉపాధిహామీ పనులలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని అర్జీలు ఇచ్చారు. అలాగే ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు రేషన్‌కార్డు, భూ సమస్యలు, తాగునీరు, డ్రైనేజీ, ఇళ్ల పట్టాల సమస్యలు, వ్యక్తిగత అవసరాలపై అర్జీలు ఇచ్చారు. స్పందన అనంతరం తహసీల్దార్ మండల, గ్రామస్థాయి అధికారులతో పెండింగ్ సమస్యలు, అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ఏఓ మల్లేష్ కుమార్, ఎంఈఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, విద్యుత్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, సుకుమార్, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేయండి



సి.బెళగల్‌లో నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: మండలానికి నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులు విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని ఎంఈఓ జ్యోతి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు 1998, 2008 డీఎస్సీ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు మండలానికి 13 మంది నియామితులయ్యారు. వారు సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయానికి చేరుకుని నియామక పత్రాలను ఎంఈఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఉపాధ్యాయులకు ప్రభుత్వ పథకాలు, నియమ నిబంధనలు తెలియజేశారు.అనంతరం ఉపాధ్యాయులను వారికి కేటాయించిన ప్రాథమిక పాఠశాలలకు పంపించారు.

ఎంబీబీఎస్ విద్యార్థి ఆత్మహత్య



మృతి చెందిన విద్యార్థి లోకేష్

గూడూరు రూరల్: కె.నాగలాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సు మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి లోకేష్ (22) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నెల్లూరు జిల్లా కావలి గ్రామానికి చెందిన లోకేష్ ఎంబీబీఎస్ సీటు రావడంతో గత మూడేళ్లుగా కళాశాల హాస్టల్‌లోనే ఉంటూ విద్యను అభ్యసిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున అశోక్ అనే విద్యార్థి లోకేష్ గదికి వెళ్లగా ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న దృశ్యాన్ని చూసి కాలేజీ యాజమాన్యానికి సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సోమ్లానాయక్ ఘటనా స్థలానికి చేరుకుని కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, యాజమాన్యాన్ని విచారించారు. లోకేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమ్లానాయక్ తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాలలో ఖాళీగా ఉన్న నాలుగు గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఎంపీడీఓ రాముడు ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలను ప్రారంభించారు. మండలంలోని పోలకల్, కొండాపురం గ్రామాలలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించగా 18 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిని సోమవారం ఇంటర్వ్యూలకు ఆహ్వానించగా 12 మంది అభ్యర్థులు హాజరయ్యారని, త్వరలోనే అర్హులైన వారిని వలంటీర్లుగా నియమిస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఎంపీపీ బొంతల మునెప్ప ఉన్నారు.

గోకులాలకు పేమెంట్లు చేయండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): జిల్లాలోని గోకులాలకు వారంలోపు పేమెంట్లు చేయాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఇంజినీరింగ్ కన్సల్టెంట్లకు గోకులాల పేమెంట్లపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ మల్లికార్జున గోకులాలను ఎలా మెజర్‌మెంట్స్ చేయాలి, ఎంబుక్స్, కంప్యూటర్‌లో ఎలా నమోదు చేయాలి తదితర సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈసీలకు కలిగిన అనుమానాలను నివృత్తి చేశారు. డ్వామా పీడీ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. వికలాంగులు, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా ప్రతి రోజూ హాజరు వేయాలని సూచించారు. డ్వామా ఏఓ నాగేశ్వర్‌రావు, ఈసీలు, ఏపీడీ సీబీ, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యోదయం.. స్వర్ణమయం

ఆస్వాదించే మనసు ఉండాలే గానీ ఆకాశంలో ఆవిష్కృతమయ్యే అందాలు అద్భుతం. సోమవారం ఉదయం లేలేత కిరణాలతో ఉదయించిన భానుడు బంగారు వన్నెతో ప్రకాశిస్తూ నీలాకాశం మొత్తం స్వర్ణకాంతులద్దాడు. చిత్రకారుడు కాన్వాస్‌పై చిత్రించాడా అన్నట్లు అరుణకాంతులు ఆకాశంలో కనిపించిన ఈ దృశ్యాలు చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించిపోయారు. గడివేముల సమీపంలోని బూజునూరు జిందాల్ ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం సూర్యోదయం వేళ ఆకాశంలో అద్దిన సువర్ణ కాంతుల దృశ్యాలు ఇవి.

– గడివేముల



సూర్యోదయం వేళ ఆకాశంలో పరచుకున్న స్వర్ణకాంతులు